ప్రాణం ఉన్నంత వరకు ప్రజల పక్షాన పోరాడుతా

• మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నకిరేకల్: సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నకిరేకల్, డిసెంబర్ 6 : నా ప్రాణమున్నంత వరకు ప్రజల పక్షాన నిలబడుతానని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. నకిరేకల్‌లో బుధవారం జరిగిన బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజల కోసం రాజకీయాల్లోకి వచ్చానని, వారిని కాపాడడంలో ముందుంటానన్నారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం కొనసాగిస్తానని తెలిపారు. బీఆర్ఎస్ కుటుంబ సభ్యులు ఎవరూ బాధ పడవద్దని అండగా ఉంటానన్నారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజమని, ప్రజాస్వామ్య బద్ధంగా ప్రజల నిర్ణయాన్ని గౌరవించాలన్నారు. పార్టీ కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ వారి కష్ట సుఖాల్లో పాలు పంచుకుంటానని తెలిపారు. రాబోయే స్థానిక సంస్థలు, పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపు కోసం కృషి చేయాలని కార్యకర్తలకు సూచించారు. బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటుందన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ రాజకొండ శ్రీనివాస్, నార్కట్‌పల్లి ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి, జడ్పీటీసీలు తరాల బలరాములు, మాద ధనలక్ష్మి, నకిరేకల్, కట్టంగూర్, కేతేపల్లి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ప్రగడపు నవీన్ రావు, ఊట్కూరి ఏడుకొండలు, మారం వెంకట్ రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఎన్నికల్లో గెలుపోటములు సహజమే

• జడ్పీటీసీ కర్నాటి వెంకటేశం

గట్టుప్పల్, డిసెంబర్ 6: ఎన్నికల్లో గెలుపోటములు సహజమేనని జడ్పీటీసీ కర్నాటి వెంకటేశం అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గ్రామాల అభివృద్ధి బీఆర్ఎస్ ప్రభుత్వం లక్ష్యంగా పని చేసిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎన్నడూ జరుగని విధంగా మునుగోడు నియోజకవర్గం అభివృద్ధి జరిగిందన్నారు. బీఆర్ఎస్‌కు మద్దతు తెలిపిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. రానున్న రోజు ల్లో బీఆర్ఎస్ అధికారంలోకి వస్తున్నదని ధీమానిచ్చారు.

అందుబాటులో ఎరువులు

చౌటుప్పల్, డిసెంబర్ 6: చౌటుప్పల్ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో 28. 28.0, పొటాష్, 20.20.13, డీఏపీ, 15.15.15, యూరియా, 14.35.14 అడుగు మందులు, యూరియా అందుబాటులో ఉన్నాయని సింగిల్ విండో చైర్మన్ చింతల దామోదర్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. మండలంలోని ఎస్.లింగోటం గోదాముల్లో ఇవన్నీ ఉన్నాయని ఆయన చెప్పారు.

అయ్యప్ప మాలధారులకు అన్నదానం

చౌటుప్పల్, డిసెంబర్ 6 : మండలకేంద్రంలోని సత్యదేవ సహిత అయ్యప్ప స్వామి ఆలయంలో బుధవారం అయ్యప్పమాలధారులకు అన్నదానం నిర్వహించారు. 15వ వార్డు కౌన్సిలర్ ఉబ్బు వరమ్మా వెంకటయ్య దంపతులు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, వార్డు కౌన్సిలర్ కాసర్ల మంజుల, ఆలయ అధ్యక్షుడు కామిశెట్టి భాస్కర్, శంకర్, సాయిలు పాల్గొన్నారు.

హోమ్‌గార్డుల అన్నదానం

మిర్యాలగూడ, డిసెంబర్ 6 : హోమ్ గార్డు దినోత్సవ సందర్భంగా పట్టణంలోని మానసిక వికలాంగుల ఆశ్రమంలో హోం గార్డులు సంఘం నాయకులు బుధవారం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమాన్ని డీఎస్పీ వెంకటగిరి ప్రారంభించి మాట్లాడారు. హోంగార్డులు సమాజ భద్రతతో పాటు ,సేవ చేయడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో హోం గార్డుల సంఘం సబ్ డివిజన్ అధ్యక్షుడు కోడిరెక్క కిరణ్‌కుమార్, సర్కిల్ అధ్యక్షుడు వందనం వెంకట్, వన్,టూటౌన్ ఎస్ ఐలు పాల్గొన్నారు.

అన్నదానం చేస్తున్న డీఎస్పీ వెంకటగిరి

అధికారులు సమన్వయంతో సమస్యలను పరిష్కరించాలి

• శాలిగౌరారం మండల సమావేశంలో ఎంపీపీ లక్ష్మమ్మ

శాలిగౌరారం: సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మమ్మ

శాలిగౌరారం, డిసెంబర్ 6: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేసి ప్రజా సమస్యల పరిష్కారం కోసం పని చేయాలని శాలిగౌరారం ఎంపీపీ గంట లక్ష్మమ్మ అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా పని చేయాలన్నారు. యాసంగి సాగులో రైతులు వ్యవసాయ రంగంలో తీసుకోవాల్సి జాగ్రత్తలను ఎప్పటికప్పుడు అధికారుల సలహాలు తీసుకోవాలన్నారు. ఎజెండాలోని ప్రతి అంశాన్ని చర్చించి సభ్యులకు వివరించారు. సమా వేశంలో జడ్పీటీసీ ఎర్ర రణీలాయాదగిరి, వైస్ ఎంపీపీ కందుల అనిత, ఎంపీడీఓ రేఖల లక్ష్మయ్య, తాసీల్దార్ పాల్ సింగ్ పాల్గొన్నారు.

12వ బెటాలియన్ కానిస్టేబుల్‌కు తెలుగు వెలుగు స్ఫూర్తి నంది పురస్కారం

నీలగిరి, డిసెంబర్ 6: తెలుగు వెలుగు స్ఫూర్తి నంది జాతీయ పురస్కారానికి నల్లగొండ 12వ బెటాలియన్ హెడ్ కానిస్టేబుల్ వి.లోకేశ్ ఎంపిక య్యారు. తెలుగు వెలుగు సాహితీ వేది క జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో జాతీయ సాంస్కృతిక సంగీత సాహిత్య నృత్య సమ్మేళనం–2023 ఈనెల 10న విజయవాడలో నిర్వహిం చనున్నారు. మునగాల మండలం జగన్నాథపురం గ్రామానికి మదర్ థెరిస్సా యువజన సంఘం వ్యవస్థాపకుడు షేక్ జాని, సభ్యుడు కానిస్టేబుల్ వి.లోకేశ్ చేస్తున్న సేవలకు తెలుగు వెలుగు స్ఫూర్తి నంది జాతీ య పురస్కారానికి ఎంపిక చేసినట్లు తెలుగు వెలు గు వ్యవస్థాపక చైర్మన్ పోలోజు రాజ్‌కుమార్ చార్యు లు, జాతీయ కన్వీనర్లు డాక్టర్ రాంగిశెట్టి రమేశ్, డాక్టర్ మోహన్ రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

జిల్లా నుంచి ఇద్దరికి అమాత్యయోగం!

మొదటి పేజీ తరువాయి

చేశారు. కానీ పార్టీ అధిష్టానం రేవంత్‌రెడ్డిని సీఎంగా ఖరారు చేసింది. సీఎంగా రేవంత్‌రెడ్డికి అవకాశం కల్పించడంతో ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి క్యాబినెట్‌లో కీలక మంత్రి పదవి దక్కనుందని తెలుస్తున్నది. ఆర్థిక శాఖ ఉత్తమ్‌కు కేటాయిస్తారన్న చర్చ ఆ పార్టీ వర్గాల్లో ఉన్నది. ఇక మరోవైపు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఎన్నికల ఫలితాల అనంతరం సీఎం పదవి గురించి ప్రస్తావించకుండా రేవంత్‌రెడ్డినే అర్హుడని ప్రకటించారు. దాంతో రేవంత్‌రెడ్డితో కలిసి క్యాబినెట్‌లో కీలక పాత్ర పోషించేందుకు సిద్ధమయ్యారు. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కోరుకున్నట్లుగా ఆయనకు పట్టణాభివృద్ధి, మున్సిపల్ శాఖ కేటాయించవచ్చని తెలుస్తున్నది. గతంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మంత్రివర్గంలో కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఐటీ, ఓడరేవుల శాఖ మంత్రిగా పనిచేశారు. కిరణ్‌కుమార్‌రెడ్డి మంత్రి వర్గంలో ఉత్తమ్‌కుమార్ రెడ్డి గృహ నిర్మాణ శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. వీరిద్దరికీ ఈ సారి జిల్లా నుంచి మంత్రి పదవులు ఖాయం కాగా కేటాయించే శాఖలపై మాత్రం అధికారికంగా స్పష్టత రావాల్సి ఉన్నది. ఇక ఇదే సమయంలో రేవంత్‌రెడ్డి మంత్రి వర్గంలో చేరిక పట్ల ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అయిష్టత చూపితే తన సతీమణి పద్మావతిపేరును సూచిస్తారన్న చర్చ సైతం కొనసాగుతున్నది. ఇదే సమయంలో సామాజిక కోణంలో ఆలేరు నుంచి గెలుపొందిన బీర్ల అయిలయ్య, దేవరకొండ నుంచి గెలుపొందిన నేనావత్ బాలూనాయక్‌ల పేర్లు కూడా మంత్రి పదవుల చర్చలో ఉన్నాయి. రాష్ట్రంలో గొల్లకుర్మ సామాజిక వర్గం నుంచి గెలుపొందిన ఏకైక ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య కావడంతో ఆయనకు ఆ కోటాలో అవకాశం లేకపోలేదన్న చర్చ ఉన్నది. మంత్రివర్గంలో గొల్లకుర్మలకు తప్పకుండా ప్రాతినిధ్యం కల్పించాలనుకుంటే తొలిసారి గెలుపొందిన అయిలయ్య అత్యంత అదృష్టవంతుడేనని రాజకీయవర్గాలు పేర్కొంటున్నాయి. ఇక ఎస్టీ సామాజిక వర్గం లంబాడీల నుంచి గెలుపొందిన ఇద్దరిలో బాలూనాయక్ సీనియర్ కావడంతో ఆయన పేరు సైతం చర్చల్లో ఉన్నట్లు తెలిసింది. ములుగు నుంచి గెలుపొందిన సీతక్కకు మంత్రి పదవి ఖాయం కాగా ఆమె ఆదివాసీ. ఒక వేళ లంబాడీలకు తప్పనిసరిగా కల్పించాలంటే మాత్రం బాలూనాయక్‌కు కూడా అవకాశం లేకపోలేదని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

ఉమ్మడి జిల్లా నుంచి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి తప్పనిసరి కాగా ఇదే జిల్లా నుంచి మరో ఒక రిద్దరికి ఛాన్స్ అంటే మంత్రివర్గ సమీకరణల్లో అంత ఈజీ కాకపోవచ్చని భావిస్తున్నారు. ఇదే జరిగితే సీఎం పదవి కాకుండా మిగిలిన 17 మంత్రి పదవుల్లో ఒకే జిల్లాకు నాలుగు అసాధ్యమే. మునుగోడు నుంచి గెలుపొందిన కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి మంత్రి వర్గంలో కాకుండా ప్రభుత్వంలో మరో కీలక స్థానం దక్కుతుందన్న ప్రచారం జరుగుతున్నది. గురువారం మధ్యాహ్నం రేవంత్‌రెడ్డితోపాటు మంత్రివర్గం మొత్తం ప్రమాణస్వీకారం చేస్తుందా? లేదా? ప్రస్తుతం కొండరేనా? అన్న దాంట్లో ఇంకా స్పష్టత రావాల్సి ఉన్నది. కాగా నేటి సీఎం, మంత్రివర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి జిల్లా నుంచి కూడా పెద్ద ఎత్తున తరలి వెళ్లేందుకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సిద్ధమయ్యారు.

కొలాబ్ ఫైల్స్ వెబ్ అప్లికేషన్‌తో పని సులభం

• కలెక్టర్ ఆర్ వీ కర్ణన్

మాట్లాడుతున్న కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్

నీలగిరి, డిసెంబర్ 6: ఎన్ఐసీ(నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్) తీసుకొచ్చిన కొలాబ్ ఫైల్స్ వెబ్ అప్లికేషన్ ద్వారా సిబ్బంది పని విధానం చాలా సులభతరం అవుతుందని కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం వివిధ శాఖల ఉద్యోగులకు కొలాబ్ ఫైల్స్ వెబ్ అప్లికేషన్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొలాబ్ ఫైల్స్ వెబ్ అప్లికేషన్ ప్రభుత్వ కార్యాలయాలకు ఎంతో ఉపయోగప డుతుందన్నారు. ఈ అప్లికేషన్‌ను విరివిగా వాడు తూ కార్యాలయంలో పని వేగంగా సులభతరం చేసుకోవచ్చని తెలిపారు. మనకు కావాల్సిన డేటాను సమీకరించుకోవడానికి కూడా అప్లికేషన్ ఉపయోగ పడుతుందన్నారు. కార్యక్రమంలో ఐటీ.డైరెక్టర్ రాకేశ్, ఐటీ మేనేజర్ ప్రకాశ్, జిల్లా ఇన్ఫర్మేటిక్స్ అధికారి గణపతి రావు సిబ్బంది పాల్గొన్నారు.

శిక్షణలో పాల్గొన్న అధికారులు

సీఎంఆర్ లక్ష్యాన్ని త్వరగా పూర్తి చేయాలి

• డీసీఎస్ఓ వెంకటేశ్వర్లు

సమావేశంలో మాట్లాడుతున్న డీసీఎస్ఓ వెంకటేశ్వర్లు

మిర్యాలగూడ రూరల్, డిసెంబర్ 6 : రైస్ మిల్లర్లు సీఎంఆర్ లక్ష్యాన్ని త్వరగా పూర్తి చేయాలని డీసీఎస్ఓ వెంకటేశ్వర్లు సూచించారు. మిర్యాలగూడ రైస్ మిల్లర్ల అసోసియేషన్ భవనంలో బుధవారం నిర్వహించిన రైస్‌మిల్లుల యజమానులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వానకాలం సీజన్‌కు సంబంధించి రైస్ మిల్లుల నుంచి రావాల్సిన బియ్యాన్ని అంచనా వేసి త్వ రగా అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇం దుకు రైసు మిల్లుల యజమానులు అధికారులకు సహకరించాలని కోరారు. సీఎంఆర్ బియ్యం అలస్యమైతే ఇబ్బంది పడాల్సి వస్తుందని పేర్కొన్నారు. ఆర్డీఓ చెన్నయ్య ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్ నాగేశ్వర్ రావు, తాసీల్దార్ హరిబాబు, సివిల్ సప్లయ్ డిప్యూటీ తాసీల్దార్ జావీద్, ఆర్ఐలు సత్యనారాయణ, శ్యాం పాల్గొన్నారు.

అదుపు తప్పి బోల్తా కొట్టిన ఆటో

కేతేపల్లి, డిసెంబర్ 6 :మండలంలోని చీకటిగూడెం గ్రామ శివారులో 65 వ నంబరు జాతీయ రహదారిపై బుధవారం టైర్ పంక్చర్ కావడంతో ప్రమాదవశాత్తు ఆటో అదుపు తప్పి రోడ్డు పక్కకు బోల్తా పడింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట మండలం యండ్లపల్లి గ్రామానికి చెందిన కాటి రమేశ్ కుటుంబ సభ్యులతో కలిసి ట్రాలీ ఆటోలో హైదరాబాద్ బయల్దేరాడు. ఈక్రమంలో చీకటిగూడెం వద్దకు రాగానే టైర్ పంక్చర్ కావడంతో హైవే పక్కన ఉన్న గుంతలోకి జారీ ఆటో బోల్తాకొట్టింది. గమనించిన స్థానికులు వెంటనే వారిని బయటకు తీశారు. ఆటోలో ఉన్న ఏడాది పాపతో పాటు మరో ముగ్గురు ఉన్నా ఎవరికీ గాయాలు కాలేదు.

బోల్తాపడ్డ ఆటో

నిరుపేద కుటుంబాలకు ఆర్థిక సాయం

మిర్యాలగూడ రూరల్, డిసెంబర్ 6 : మండలంలోని శ్రీనివాసనగర్ గ్రామంలో ఇండ్లు 25 నిరుపేద కుటుంబాలకు బోగవిల్లి సునీత మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఒక్కొక్క కుటుంబానికి రూ. వేయి చొప్పున రూ.25 వేల నగదు సర్పంచ్ బోగవిల్లి వెంకట రమణ చౌదరి బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ తన సతీమణి సునీత పేరున ఫౌండేషన్ ఏర్పాటు చేసి ఇండ్లు లేని ప్రతి నెల నిరుపేద కుటుంబాలకు ఆర్థిక సాయం అందిస్తున్నట్లు తెలిపారు. పేదలకు ఆవాస భరోసా కార్డులను అందించి సాయం అందిస్తామని చెప్పారు. ఫౌండేషన్ ద్వారా ముమ్ముందు అనేక సేవా కార్యక్రమాలను విస్తరించనున్నట్లు పేర్కొన్నారు.

పేదలకు ఆవాస భరోసా కార్డులను అందజేస్తున్న సర్పంచ్ వెంకటరమణ చౌదరి